క్లుప్తంగా

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మధుసుదన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామ పరిధిలోని సాయి దర్శన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న చిల్డ్రన్ పార్క్, దేవాలయం, కమ్యూనిటీ హాల్, కాలనీ ముఖద్వారం నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కాలనీవాసులతో కలిసి మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిదర్శన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటరావు, కాలనీవాసులు జగదీశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో చంద్రశేఖర్‌కు సత్కారం



సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నారాయణఖేడ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో నారాయణఖేడ్ మండలం ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓతే చంద్రశేఖర్ పాల్గొని హిందీ భాషలో తెలంగాణ సాహిత్యం, పోరాట చరిత్ర, అమరుల త్యాగం, సాంస్కృతిక సంప్రదాయం, జీవన గమనం గురించి వివరించారు. న్యాయ నిర్ణేతగా ఖేడ్ రసగీతి సాహితీసంస్థ అధ్యక్షుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన చంద్రశేఖర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

కొండముచ్చుకు అంతిమ సంస్కారాలు



కొండ ముచ్చును ఊరేగిస్తున్న గ్రామస్తులు

జహీరాబాద్ టౌన్: కొండముచ్చు మృతి చెందడంతో పంచాయతీ పారిశుధ్య కార్మికులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో ఆదివారం ఓ కొండ ముచ్చు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు కొండ ముచ్చును సాంప్రదాయ పద్దతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ట్రాక్టర్‌పై కొండ ముచ్చుకు ఊరేగింపు నిర్వహించారు. గ్రామ ప్రజలు అంతిమ సంస్కారాల్లో పాల్గొని మానవత్వాన్ని చాటుకున్నారు.

అనారోగ్యంతో విలేకరి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అనారోగ్యంతో సీనియర్ విలేకరి విజయ్‌కుమార్(49) ఆదివారం మృతి చెందాడు. మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన ఇతను గతంలో వివిధ పత్రికల్లో 20 సంవత్సరాల పాటుగా కంట్రిబ్యూటర్‌గా సేవలు అందించారు. అంత్యక్రియల్లో నాయకులు, జర్నలిస్టులు పాల్గొని విజయ్‌కుమార్‌కు నివాళులు అర్పించారు.

కాలుష్య జలాల ప్రవాహం



జిన్నారం (పటాన్‌చెరు): ఎండాకాలంలోనూ కాలుష్య జలాల ప్రవాహం కొనసాగుతోంది. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలో కాలుష్య జలాలు భారీగా సమీపంలోని చెరువుల, కుంటల్లోకి ప్రవహిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాలుష్య జలాలను బయటకు వదులుతున్న పరిశ్రమల యాజమానులపై పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరామర్శ

నారాయణఖేడ్: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వ్యక్తిగత సహాయకులు శంకర్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆస్పత్రికి వెళ్లి శంకర్ తల్లిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వైద్యులను కోరారు.

ఆటస్థలాలు ఇలా.. ఆడుకునేదెలా?

- హడావుడిగా ప్రారంభం
- ఆ తర్వాత కన్నెత్తిచూడని వైనం
- బీడు భూములను తలపిస్తున్న మైదానాలు
- చర్యలు చేపట్టాలని క్రీడాకారుల విన్నపం



సాయిపేట పాఠశాల ఆవరణలో ఓ మూలన ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణ బోర్డు



కేరూర్‌లో క్రీడాప్రాంగణ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు, విరిగిన స్వాగతం బోర్డు

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ యువత, పిల్లలు ఆటలు ఆడుకునేందుకు వీలుగా తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించింది. దీంతో హడాహుడిగా ప్రారంభించడమే తప్ప ఆ తర్వాత వాటిని పట్టించుకునేనాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు, క్రీడాకారులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను చూస్తుంటే బీడు భూములను తలపిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఇలా ఉంటాయా? అని ప్రభుత్వ తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. వట్‌పల్లి మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మెజార్టీ గ్రామాల్లో క్రీడాప్రాంగణాల పరిస్థితి ఇదేవిధంగా ఉంది.

స్వాగత బోర్డులకే పరిమితం

ప్రభుత్వం పకడ్బందీ నిబంధనలతో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని చెప్పింది. కానీ పనులన్నీ హడాహుడిగా, ఇష్టారీతిన చేపట్టి చేతులు దులుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో స్థలాల సమస్య ఉండటంతో పాఠశాల మైదానాలు, ఇరుకైన స్థలాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించినట్లుగా దాఖలాలు కనిపించడంలేదు. వాలీబాల్ కోర్టు కోసం రెండు వైపులా స్తంభాలు, స్వాగత తోరణం, వ్యాయామ బార్లు పాతుతున్నారు. ఎక్కడా చూసినా అవే కనిపిస్తున్నాయి. లాంగ్‌జంప్ పిట్లు, ఖోఖో కోర్టులను చదును చేసిన మైదానాలు ఎక్కడా కనిపించడంలేదు.

కనబడని క్రీడా సామాగ్రి..

కొన్ని క్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్ కోర్టు, నెట్, బాల్ ఇవి ఏవీ కంటికి కనపడవు, ఖోఖో, కబడ్డీ కోర్టులు, లాంగ్‌జంప్ కోర్టులు, చదును చేసిన మైదానం చుట్టూ మొక్కల పెంపకం వంటివి ఏవీ లేవు. ఇవన్నీ కళ్లకు కట్టినట్లు కనపడుతున్న మండల అధికారులు వాటివైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మండల కార్యాలయంలో అధికారుల గురించి అడిగితే.. అటెండర్ల నుంచి ఉద్యోగులు వరకు ఫీల్డ్‌కు వెళ్లారని చెబుతారు. మరి ఏ ఫీల్డ్‌కు వెళ్లారో వాళ్లకే తెలియాలని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. ఫీల్డ్‌కు వెళ్తే క్రీడా ప్రాంగణాలు ఇలా ఎందుకుంటాయని పలువురు విమర్శిస్తున్నారు.

పిచ్చిమొక్కలతో..

మండలంలోని కేరూర్ గ్రామానికి కిలోమీటర్ దూరంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా అది స్వాగత బోర్డుకే పరిమితమైంది. ఆ భూమి వివాదాస్పదం కావడంతో బోర్డును కూడా విరగొట్టి పక్కన పడేశారు. సాయిపేటలో స్కూలు ఆవరణలో ఓ మూలన స్వాగత తోరణం పెట్టారు. బిజిలీపూర్‌లో క్రీడాప్రాంగణం చదును లేకుండా పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. ఇలా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థి తి నెలకొంది. ప్రభుత్వం ఎంతో మంచి ఆలోచనతో రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులను పట్టించుకోకుండా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

> **క్రీడా వసతులు కల్పిస్తున్నాం**
>
> గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో స్థలాల కేటాయింపుల్లో వివాదాలు నెలకొన్నప్పటికీ అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయించాం. స్థల వివాదాలు నెలకొన్న ఆయా గ్రామాల్లో పాఠశాలల ఆవరణలో ఏదైన ఆట ఆడేందుకు వీలుగా ప్రాంగణం ఏర్పాటుచేసి వసతులు కల్పించాం. ఎక్కడైనా స్థలం ఉండి వసతులు లేకపోతే తప్పకుండా అక్కడా అన్ని క్రీడా వసతులు కల్పిస్తున్నాం.
>
> – జగదీశ్వర్, ఎంపీడీఓ, వట్‌పల్లి

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన

మనూరు (నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లి పరిధిలోని కొండానాయక్ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ఆదివారం తండాలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ మాట్లాడుతూ ఎనక్‌పల్లి నుంచి కొండానాయక్ తండాకు వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా ఉందని, రాకపోకలకు వీలులేకుండా మారడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో అనారోగ్యం పాలైతే అంబులెన్స్‌రాని దుస్థితి ఉందని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. గిరిజన తండాలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న పాలకులు తండాల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ సురేష్‌నాయక్, రవినాయక్, వాసు, శ్రీనివాస్, వినయ్ కిషోర్, పర్లాద్, గోవింద్, రాజు, శంకర్, రూప్‌సింగ్, మారుతి, గణపతి, నారాయణ పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న గిరిజనులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న గౌసోద్దీన్

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వైస్ ఎంపీపీ గౌసోద్దీన్ అన్నారు. మండల పరిధిలోని అత్నూర్ గ్రామంలో రూ.55లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అత్నూర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.20లక్షలు ఎస్‌డీఎఫ్, రూ.10లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్, రూ.5లక్షలు సీడీపీ నిధులు, రూ.12లక్షలు ఎంపీటీసీ నిధులు, రూ.8లక్షలు పంచాయతీ నిధులు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంగ్రాం పాటిల్, రఫీయోద్దీన్, చాంద్ పాష, నీలయ్యగౌడ్, అశోక్ పాటిల్, యాదవరావు పాటిల్, ఖాజామీయా పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడి ఆలయంలో ఎంపీ పూజలు



గృహ ప్రవేశానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయకుడిని ఆదివారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శుభకార్యానికి ఎంపీ బీబీ పాటిల్ హాజరు

న్యాల్‌కల్ జెడ్పీటీసీ స్వప్నభాస్కర్ గృహ ప్రవేశానికి ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు రవీందర్, షేక్ ఫరీద్, నర్సింహారెడ్డి, సుభాష్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పెంటారెడ్డి, గౌసోద్దీన్, మల్‌రెడ్డి, అమీర్, బస్వరాజ్ పాటిల్, రాజుపాటిల్, ప్రవీణ్‌కుమార్, పాండురంగారావు పాటిల్, రాజ్‌కుమార్, పీటర్‌రాజు హాజరయ్యారు.

ధూప దీప నైవేద్యం పథకం అమలుకు కృషి

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దుర్గాభవాని ఆలయ కమిటీ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని దుర్గాభవాని ఆలయానికి ధూప దీప నైవేద్య పథకం అమలుకు కృషి చేస్తానని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింప చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. దుర్గాభవానీ ఆలయానికి కూడా వర్తించే విధంగా సహకరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన పథకం అమలుతోపాటు ఆలయ పునః నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర నాగరాజ్‌గౌడ్, కనిగిరి శంకర్, ఎర్ర శ్రీహరి, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భగవాన్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, గణేష్‌గౌడ్, నర్సింలుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, పాలనేత్రగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కనిగిరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగించుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయనిధిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలో పట్టణ మండల పరిధిలోని పలువురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చీలమల్లన్న, కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఏడు వారాల జాతర ఆదివారంతో ముగియనుండటంతో హుండీ లెక్కింపు చేపడతామన్నారు. ఉదయం 11గంటలకు ఎండోమెంట్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య లెక్కించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వచ్ఛందంగా పాల్గొనవచ్చన్నారు.

వరద కాలువ కబ్జా కాకుండా చూడండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వరద కాలువలు కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ నీటి సంఘం చైర్మన్ నరసింహ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, వరద కాలువలు యథేచ్ఛగా కబ్జాల పాలవుతున్నాయని, ఇటీవల తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువలు పూర్తిగా కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. అదేవిధంగా ఇరిగేషన్ అధికారులు ఇష్టానుసారంగా ఎన్‌ఓసీలను ఇస్తున్నారని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వరద కాలువలో పేరుకుపోయిన మట్టిని తీయాలని కోరారు. వరద కాలవల కబ్జాలపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



వరద కాలువను చూపుతున్న నరసింహ

పాఠశాలల పున: ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



పాఠశాలను సందర్శిస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ పీపీ రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సమకూర్చినట్లు తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు శుభ్రం చేయించి పాఠశాలల పున: ప్రారంభానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులందరూ పాఠశాల పునః ప్రారంభం రోజు విద్యార్థులకు ఉచిత యూనిఫాం పుస్తకాలను స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేతుల మీదుగా పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభం నేపథ్యంలో తల్లితండ్రులు తమ పిల్లలను సకాలంలో పాఠశాలకు పంపాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే తల్లితండ్రులు పాఠశాలల్లో చేర్పించకముందే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్నటువంటి పాఠశాలల్లో మాత్రమే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. గుర్తింపులేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించినట్లయితే విద్యాశాఖ బాధ్యత వహించదని తెలిపారు. ఇప్పటికీ అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల యజమానులు త్వరగా జిల్లా విద్యాధికారి ద్వారా అనుమతి పొందాలని సూచించారు. రెన్యువల్ చేయించుకోలేని పాఠశాలలు కూడా త్వరలో దరఖాస్తు చేసుకొని రెన్యువల్‌కు అనుమతి పొందాలన్నారు. లేనిపక్షంలో జిల్లా విద్యాధికారి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లీకేజీలతో తాగునీరు వృథా



నారాయణఖేడ్: వృథాగా పోతున్న తాగునీరు



సంగారెడ్డి మున్సిపాలిటీలో..

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ శివారులోని నారాయణఖేడ్–జూకల్ రోడ్డు పక్కన జూకల్‌తో పాటు వివిధ గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ ఆదివారం లీకవ్వడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ మార్గంలో తరచూ పైప్‌లైన్ లికేజీ అవుతుండటంతో తాగునీటికి తిప్పలు తప్పడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మంజీరా నీరు వృథా

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి, పోతిరెడ్డిపల్లి, రెడ్డి కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏఈ, డీఈ వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతనంగా రోడ్డు వేయించాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి అండూర్ వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నీరుడి వీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అండూర్ రోడ్డు అధ్వాన్నంగా మారిందని, మండలంలోని అన్ని రోడ్లు డబుల్ రోడ్లుగా మారుతున్నా అండూర్ రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సోలక్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి అండూర్ వరకు నూతనంగా రోడ్డును వేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ నేడు ఖేడ్‌లో తెలంగాణ రన్

నారాయణఖేడ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఉదయం 6 గంటలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో తెలంగాణ రన్‌ను నిర్వహించనున్నట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తహసీల్ గ్రౌండ్ నుంచి రన్ ప్రారంభమవుతుందన్నారు. ఖేడ్ డివిజన్ పరిధిలోని యువత, యువజన సంఘాలు, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన హలీమాబేగం కుమారుడు ఇలియాద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇటీవల ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్, కేంద్ర ఆహార సంస్థ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఖేడ్‌లోని ఇలియాద్ కుటుంబీకులను పరామర్శించి కొంత నగదును సహాయంగా అందజేశారు. ఆయన వెంట కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, షేక్ అహ్మద్, మున్వర్ ఖురేషి ఉన్నారు.

◆ నేటి నుంచి విత్తనాల పంపిణీ

కోహీర్(జహీరాబాద్): పచ్చిరొట్ట ఎరువును ఇచ్చే జనుము, జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్ పీచేర్యాగడి, మాచిరెడ్డిపల్లి కేంద్రాలతో పాటు కోహీర్ డీసీఎంఎస్‌లో 40 క్వింటాళ్ల జనుము, 80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుములు 40 కిలోల బస్తా రూ.1225లకు, జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా రూ.843 సబ్సిడీ ధరకు విక్రయిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత ఏఈఓల వద్ద టోకెన్లు తీసుకొని ఆయా కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

◆ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని దోమడుగు గ్రామానికి చెందిన నర్సారెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇందుకు గాను ఎమ్మెల్యేకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేట ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. అధికసంఖ్యలో భక్తులు నగర సంకీర్తనలో పాల్గొన్నారు. భవానీ మందిరం నుంచి భక్తులు భజన చేస్తూ కీర్తనలు పాడుకుంటూ పాదయాత్ర నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి రాచన్నపేట ప్రాంతంలో పాదయాత్ర కొనసాగింది. పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారులు, నాయకులు, మహిళలు, పిల్లలు పాల్గొని భగవన్నామస్మరణ చేశారు.

◆ క్రీస్తు బోధనలను ఆచరించాలి



కంది(సంగారెడ్డి): యేసుక్రీస్తు బోధనలను ఆచరించాలని పాస్టర్ యేసుపాల్ పిలుపునిచ్చారు. కందిలోని రాక్ చర్చిలో పిల్లలకు నిర్వహించిన బైబిల్ పాఠశాల ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా యేసుపాల్ మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. అనంతరం వేసవి పాఠశాలలో నేర్చుకున్న విషయాలను చిన్నారులు ప్రదర్శన రూపంలో వివరించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

◆ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి నియోజకవర్గంలోని కల్పగూర్ గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, సంగారెడ్డి మండల అధ్యక్షుడు పాపన్న, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ నిధుల మంజూరుకు విజ్ఞప్తి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి గతంలో ఇచ్చిన హామీ మేరకు నిధులను మంజూరు చేయాలని కోరుతూ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఆదివారం హైదరాబాద్‌లోని అయన నివాసంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గౌరీరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పందించిన వైవీ సుబ్బారెడ్డి నిధుల మంజూరు చేస్తానని వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

◆ వైఎస్‌ఆర్‌టీపీలో చేరికలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని తంగడపల్లి తండాకు చెందిన పలువురు యువకులు ఆదివారం వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాయినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గంగులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఏర్పుల శ్రీనివాస్‌కు పురస్కారం



జిన్నారం(పటాన్‌చెరు): సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న జిన్నారం గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్‌కు మయూరి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేశారు. వివిధ రంగాల్లో ప్రజలకు సేవలను అందిస్తున్న వారిని గుర్తించి జాతీయ స్థాయిలో పురస్కారాన్ని మయూరి సంస్థ అందిస్తోంది. జిన్నారం గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్ చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో మయూరి సంస్థ ప్రతినిధులు రాధ, రవిశర్మ, నీలిమలు శ్రీనివాస్‌కు పురస్కారాన్ని అందజేశారు. తాను చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో మయూరి సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని శ్రీనివాస్ అన్నారు.

అదుపుతప్పి ఆలయ ప్రహరీని ఢీకొట్టిన కారు



వట్‌పల్లి(అందోల్): కారు అదపుతప్పి ఆలయ ప్రహరీని ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. మండలంలోని నాగులపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. ఆల్టో కారు జోగిపేట వైపు నుంచి వట్‌పల్లి వస్తూ నాగులపల్లి సమ్మక్క, సారలమ్మల ఆలయం వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఎక్సెల్ వాహనాన్ని, ఆలయ ప్రహరీని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం, ప్రహరీ ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆలయం వద్ద ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది.